COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం : 

విజయవాడ,
తేది: 7 ఏప్రిల్, 2018.

## కాంట్రాక్టర్లకు, అనుయాయులకు ఖజానా దోచిపెట్టే విధానాలు ప్రభుత్వం మానుకోవాలి

కాంట్రాక్టర్లకు, అధికారపార్టీ అనుయాయులకు అడ్డగోలుగా రాష్ట్ర ప్రభుత్వ ఖజానాను దోచిపెడుతున్నారని చాలా కాలంగా విపక్షాలు, వివిధ ప్రజాసంఘాలు చేస్తున్న విమర్శను తాజాగా వెలువడిన కాగ్ నివేదిక నిర్ధారించింది. వ్యయ నియంత్రణ, పర్యవేక్షణ బలహీనంగా వున్నాయని, అప్పులు విపరీతంగా పెరగడం భవిష్యత్తులో తీవ్ర పరిణామాలకు దారితీస్తుందన్న హెచ్చరికను ప్రభుత్వం పరిగణలోనికి తీసుకొని ఆర్థిక యాజమాన్యంలోని లోటుపాట్లను వెంటనే సరిదిద్దుకోవాలి. లేకపోతే ఈ పాలకులు చేసిన నేరానికి రాష్ట్ర ప్రజలు శిక్ష అనుభవించాల్సి వస్తుంది.

ఒక్క నీటి పారుదల శాఖలోనే అంచనా వ్యయానికి మించి 27 వేల కోట్ల రూపాయలకు పైగా చెల్లించారంటే కాంట్రాక్టర్ల పట్ల ప్రభుత్వం ఎంత ఉదారంగా ఉందో విదితమవుతోంది. గతంలో జలయజ్ఞం పేరిట సాగిన ధన యజ్ఞాన్ని ఈ ప్రభుత్వమూ కొనసాగిస్తోందన్నమాట. రూ. 135 కోట్లు కేటాయించిన నీరు-చెట్టు పథకానికి ఎనిమిది రెట్లు నిధులు పెంచి రూ.1242 కోట్లు విడుదల చేయడం ద్వారా అధికార పార్టీ అనుయాయులకు లబ్ది చేకూర్చారన్నది సుస్పష్టం. ఈ పథకం పేరుతో దళితులు, పేదల అనుభవంలోని వేల ఎకరాల భూముల్ని పెత్తందార్లు అన్యాక్రాంతం చేసిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. ఇటు ప్రజాధనాన్ని అటు పేదల జీవనోపాధికి హానికరంగా ఉన్న విధానాన్ని సర్కారు విడనాడాలి.

దళితులు, గిరిజనుల అభివృద్ధి గురించి ప్రభుత్వం భారీ ప్రచారం చేసుకోవడమే తప్ప నిజంగా వారికి కలిగిన ప్రయోజనం నామమాత్రంగా వుంది. ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల పనితీరు అధ్వాన్నంగా వుందని, కనీస సర్వే కూడా లేకుండా చేస్తున్న లబ్దిదారుల ఎంపిక ప్రహసనంగా మారిందని కాగ్ పేర్కొనడం గమనార్హం. రుణ లక్ష్యంలో కనీసం 50% కూడా విడుదల చేయలేదంటేనే ఎస్సీ, ఎస్టీల పట్ల ప్రభుత్వం ఎంత నిర్లిప్తంగా వుందో అవగతమవుతుంది.

విద్యా ప్రమాణాలు దిగజారుతున్నాయని, డ్రాపవుట్లు పెరుగుతున్నాయని కాగ్ చేసిన హెచ్చరికను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలి. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుందని ప్రముఖ విద్యావేత్తలు చెప్పిన మాటను సర్కారు చెవికెక్కించుకోవాలి. 1014 ప్రాథమిక, 37 ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో ఒక్క టీచరు కూడా లేకపోవడం రాష్ట్రంలో 12,955 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయంటేనే విద్యపట్ల ప్రభుత్వ ఉదాసీన వైఖరిని తేటతెల్లం చేస్తోంది.

కేంద్రం నుండి నిధులను రాబట్టుకోవడానికి అన్ని విధాలా ప్రయత్నించడం, ప్రజా ఉద్యమానికి పూనుకోవడం అవసరమేకానీ, రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నిర్వహణలో ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకుండా చూడడం ప్రభుత్వ బాధ్యత. ఇప్పటికైనా అప్పులు తెచ్చే విషయంలోనూ, ప్రాజెక్టుల అంచనా వ్యయాలు పెంచే విషయంలోనూ ప్రభుత్వం సక్రమంగా వ్యవహరించాలి. అధికార పార్టీ అనుయాయులకు, కాంట్రాక్టర్లకు ఖజానాను దోచిపెట్టే విధానాలు మానుకోవాలి.

(పెనుమల్లి మధు)
రాష్ట్రకార్యదర్శి